# ఆమె నేర్పిన ప్రసన్న శాంతి

'జయంతి'

ముప్పొద్దులూ గడచిపోయిన నా మానసిక యాత్రలో మల్లమ్మని మరచిపోయిన క్షణంలేదు. మల్లమ్మలాంటివాళ్లు జీవిస్తూండబట్టే యీ భూమ్మీద యిన్ని నీళ్లయినా పుడుతున్నాయని నాకు నమ్మకం. నేను మొదట చూసినప్పుడు మల్లమ్మకు పదకొండేళ్లుంటాయి. ఉబికే యౌవనపు పొంగులో వికసించే వనలక్ష్మిలా కంటబడుతుండేది. ఆ తెలివి, నడక, చురుకు, గమనిక పల్లెటూళ్లో చూడడం అదే నాకు మొదటిసారి. ఆనాటినుండీ నాకు పల్లెల్లో ఊపిరాడినట్లు పట్నాల్లో ఊపిరాడదు. నే నావూరు పోవడ మేమిటి,మల్లమ్మ నాదగ్గరికిరావడ మేమిటి-ఏదో జన్మాంతర సంబంధమయివుండాలి.

'బియ్యం బాగుచేయించుకోవు దొరా!'

'తప్పకుండా. బాగుచేస్తావా?'

'ఆ-ఏమిస్తావు?'

మల్లమ్మకు ధనంమీద ఎంతఆశ! అంతేకాదు. బేరమాడడంలో ఎంత చాకచక్యం! ఎంత తెలివి!

'ఏమిమ్మంటావు?'

'ఒక రూపా యియ్యి దొరా.'

నా మనస్సు పదిరూపాయ లిమ్మంటోంది. అయినా సంభాషణ సాగించాలని కుతూహలం.

'సరిగా చెప్పు మల్లమ్మా'

'పధ్నాలుగణా లియ్యి, పోనీ'

'మరోమాట'

'ఆఖరిమాట-పన్నెండణా లియ్యి.'

మల్లమ్మ బియ్యం తీసుకువెళ్లింది. గతరాత్రి ఆమెతండ్రి చెప్పిన సంగతులు నా మనస్సులో విహారం చేస్తున్నాయి. మల్లకు పెళ్లిచేసి ఆయన తన బాధ నివారించుకొన్నాడట. అంతచక్కని పిల్లకి వరుడు దొరకనట్లు- సౌభాగ్యపురంలో పుట్టిన పిల్లని వినోదపురం యిచ్చారు. నలభై మైళ్లెలా పంపగలిగారో.

మల్లమ్మ బియ్యం తెచ్చింది. ఆమె చెయ్యి తగిలిన నా బియ్యం నాకు అమృతప్రాయం. రూపాయ తీసి ఇచ్చాను.

'చిల్లరలేదు, దొరా'

'అక్కర్లేదు-నీకే యీ రూపాయి'

'కాదయ్యా-నావి పన్నెండణాలే'

'సరేకాని మల్లమ్మా- మీ ఆయన ఇక్కడికి ఎప్పుడు వస్తాడు?'

'నాకేం తెలుసు నయ్యా.'

'మీ ఆయనతో నువ్వు మాట్లాడుతావా?'

'ఊరుకో, దొరా!'

'ఫరవాలేదు చెప్పు.'

మల్లమ్మ తల వంచుకుంది. తెలిసీ తెలియని తన భర్తనుతలుచుకుంటూందిగావును.సిగ్గు తెరలు ఆమె ముఖారవిందంమీద రెపరెపలాడుతున్నాయి.

'సరేకాని, చెప్పు మల్లమ్మా- ఇదివరకెప్పుడేనా మాట్లాడావా?'

లే దన్నట్లు తల వూపింది.

'మరి నాతో మాట్లాడతావే. అలాగే మాట్లాడితేనేం'

'మరి నువ్వు గొప్పవాడివి దొరా!'

'ఎంతమాత్రంకాదు. (నీ భర్త అదృష్టంలో నాకుసహస్రాంశం లేదు'-అనబోతోంది మనస్సు. ఆ మాటలే ఆ నాటికీ ఈ నాటికీ పునశ్చరణ చేసుకుంటూందికూడా.

నాలుగేళ్ళు గడచాక మళ్ళీ సౌభాగ్యపురం మకాం. కాలప్రవాహంలో ఎన్ని యాతలీదినా మల్లమ్మ గుండెల్లోనే వుంది. ఈసారి మల్లమ్మ నాదగ్గిరికి రాదు. బియ్యం బాగుచెయ్యదు. నాతో మాట్లాడదు. అయినా, పూర్ణయువతి అయిన మల్లమ్మ దర్శనానికి ఎంతో ఆరాటం. బావివద్ద ఆనాడు నీళ్ళు ముంచుకు వెడుతోంది. సాయంత్రపు నీరెండ ఆమెమీద ఏటవాలుగా పడుతోంది. చంకని బిందె పెట్టుకుని ఒయ్యారంగా నడిచే మల్లమ్మ నన్ను చూడలేదని చెప్పనుగాని, చూచినట్లు రూఢి కాలేదు. తెలి కన్నుల మీద, సోగ బుగ్గలమీద, కంఠపు ముడతలమీద యౌవనపు నిషా చూస్తూ నిలబడ్డాను. ఘల్లున మ్రోగే ఆమె అందెలరవళి ఊర్వశీ నృత్యాన్ని

భావనకు తెస్తోంది. ఊగుతూన్న ఆమె రెండో చెయ్యి నాగుండె నూపుతోంది. సంఘం ఆమె చుట్టూ బిగించిన బంధాలు నన్ను హతాశునిగా చేస్తున్నాయి. అయినా ఆమెతో మాట్లాడాలనే గాఢవాంఛ నాలో ప్రబలిపోతూంది.

ఆరాత్రి మల్లమ్మ తండ్రి నాదగ్గరి కొచ్చేడు. నన్ను గుర్తించాడు. మల్లమ్మ నన్ను చూసిందనీ, నావిషయం అడిగిందనీ అన్నాడు. అంతే చాలు పదివేలు!

కాలచక్రగమనంలో ఇంకో ఆరు సంవత్సరాలు గడిచాక మళ్లీ సౌభాగ్యపురం పోగలిగాను. ఈసారి నేను మారకపోయినా లోకం మారిపోయింది. నే నేదో నిద్రపోయి లేచినట్లయింది. విషయా లెన్నో విశేషాలుగా మారిపోయాయి. మల్లమ్మమీద కష్టా లెన్నో విరుచుకు పడ్డాయి. ఆమెనూ, నాలుగేళ్ళ పిల్లనూ విడిచి ఆమె భర్త ఎక్కడికో వెళ్లిపోయాడు. ఎన్నడూ తిరిగి రా నన్నాడట. ఈరెండేళ్ళనించీ అతని సంగతే తెలియదట ఎవరికీ. ఎంత అయోగ్యుడా, నిర్భాగ్యుడా అనుకున్నాను. 'ఏమో, ఏం కారణమో'అని సమాధానం చెప్పుకున్నాను. మల్లమ్మకు జీవనాధారం లేదు. పైగా నాలుగేళ్ళపిల్ల. ఎలా బ్రతుకుతుంది? ఆశానిరాశల సంఘర్షణలో నలుగుతూ రానన్న భర్త మీద ధ్యానంపెట్టి ఎలా బ్రతుకుతుంది? నా మనస్సు చెలరేగింది. 'పోనీ నేను పెళ్ళాడితే- మల్లమ్మ ఒప్పుకుంటుందా? ఎందుకు ఒప్పుకోదు— తన బాగుకేగా. నాకుకూడా కావలసిం దేమిటి? నేను ఎందుకు పెళ్ళి మానుకున్నాను? ఇంతటి సౌందర్యవతి నిజంగా నాకు చిక్కుతుందా?' కళ్లు మూసుకున్నాను. ఒప్పుకుంటుంది. ఒప్పించగలను అనే ధైర్యం.

ఆవేళ మల్లమ్మ బావికి నీళ్ళకోసం వచ్చింది. నన్ను చూచీ చూడనట్లు పోయింది. రెండోరోజు కొంచెం పరికించింది. మూడోనాడు గుర్తించి నా కళ్ళలోకి చూచింది. నాలుగో దినం మాట్లాడబోయి మానేసింది. నా జీవితం నిజంగా అమృతమయమవుతుందా? ఆమె నా దవుతుందా? ఎవరికీ అందని ఆకాశంమీదికి మల్లమ్మని తీసుకుపోగలనా?

అయిదోరోజు రాత్రి పదిగంటలికి మల్లమ్మ చెల్లెలు పదేళ్ళపిల్ల భయపడుతూ వచ్చింది. 'మా అక్క మిమ్మల్ని రమ్మంటోంది—చెరువుగట్టుకు. రూపాయ లేమైనా తీసుకు రమ్మంది.' అంది అమాయికపు పిల్ల. మల్లమ్మస్థితి ఇంత అధోగతికివచ్చిందా అనుకున్నా. నాలో విజయగర్వం ఎక్కువైంది. భూమ్యాకాశాల భేదం తెలియలేదు. ఇరవై రూపాయలతో బయలుదేరా.నిజంగా మల్లమ్మ చెరువుగట్టుకువచ్చింది. ఇంకేంకావాలి?

'వచ్చావా! మల్లమ్మా!'

'ఆ- కొంచెం ఆగండి' సమీపిస్తూన్న నా చేతుల్ని కొంచెం ప్రక్కకు నెట్టుతూ.

'సొమ్ము తెచ్చారా?

'ఆ- ఇవిగో, ఇరవై.'

'ఇంతే?'

'ఇంకెంత కావాలి?'

'ఎంతా? మీ రివ్వలేనంత- ఈయిరవై రూపాయలతో నన్ను కొనదలిచారు మీరు. ఈ విషయాలు మీతో చెప్పడానికే నేను పిలిచాను. మీ చూపులు నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నాయి. పొండి, దయవుంచి యీవూరినుండి వెళ్ళిపొండి.'

'చూడు మల్లమ్మా-నీ విషయాలు తెలిశాయి. వెళ్లిపోయిన నీభర్తమీద ధ్యానంపెట్టుకు ఎంత కాలం గడుపుతావు? నీయిష్టమైతే నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను.'

మల్లమ్మ వెగటుగా నవ్వింది.

'నా కేమీ వద్దు. నామంచి కోరేవారైతే రేపే వెళ్లిపోండి.'

'నామాటనమ్ము, మల్లమ్మా-ప్రపంచంతోడు'

'వద్దు. ఆధ్యానం ఎన్నడూ మనస్సులో వుంచుకోవద్దు'

'నీగతి ఎలాగ మల్లమ్మా, ఆలోచించు.నువ్వు, నీబిడ్డ ఏం తింటారు? ఎలా బ్రతుకుతారు?'

'ఆ దేవు డున్నాడు'

అంతే. మల్లమ్మని వొప్పించ లేకపోయాను. నా ప్రవర్తనకి క్షమాపణ చెప్పుకునే ముందే ఆమె వెళ్లిపోయింది.

ఆదినం మొదలు ఆకాశంమీద ఏనక్షత్రపంక్తులుచూచినా 'దేవుడున్నా'డనే కనబడుతుంది.

మలయానిలం దేవుడున్నాడనే నాచెవులో చెబుతూ దూసుకుపోతుంది. వసంతకోకిల దేవుడున్నాడనే ఉద్ఘాటిస్తుంది. వెంటనే - మల్లమ్మకూడా వుండి, అని నాలో నేను చెప్పుకుంటాను.